Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 186 | హైదరాబాద్ | శనివారం 30 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు ధర్మాసనం హితవు

'నీట్'లీకేజీ విద్యార్థులకు, వారి కుటుంబాలకు తీరని వేదన

జవాబుదారీతనం లేకపోతే సమస్య పరిష్కారం కాదు

సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశం

న్యూఢిల్లీ: మన యువతను ఎప్పుడూ నిరాశపర్చకూడదని సుప్రీంకోర్టు సూచించింది. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)--యూజీలో అక్రమాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకు ఈ వైద్య ప్రవేశ పరీక్షకు సంబంధించిన అసలు సమస్య పరిష్కారం కాదని వెల్లడించింది. నీట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు పదేపదే పునరావృతం కావడం వ్యవస్థాగత వైఫల్యమేనని స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించింది. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) పరీక్షల విధానం గురించి సుప్రీంకోర్టు ప్రస్తావించింది. యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో పేపర్ లీక్ వంటి

- మిగతా 2వ పేజీలో



# నాకూ మినహాయింపొద్దు

## ఎస్ఐఆర్‌పై ఓ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కేటాయించండి: సీఎం రేవంత్

క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి పనిచేస్తా

టీపీసీసీ పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి

పార్టీ కోసం మంత్రులు, ఎంపీలు పని చేయాల్సిందే

వచ్చే ఎన్నికల్లో కోటికిపైగా ఓట్లు వస్తేనే 100 సీట్లు

'సర్'లో ఒక్క ఓటూ పోకుండా చూడాలి

కొందరు ఎమ్మెల్యేలు జమీందార్లుగా మారారంటూ ఫైర్

తమ వ్యక్తిగత ప్రచారం తప్ప పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనివ్వడం లేదని వ్యాఖ్య

హైదరాబాద్, మే 29 (ప్రజాతీర్పు): 'పార్టీ కోసం అందరూ పనిచేయాల్సిందే. కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులతో సహా. నాకు కూడా మినహాయింపు ఇవ్వొద్దు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమించిన ఇన్‌చార్జీలతో సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలతో మమేకం కావాలి. నా అసెంబ్లీ నియోజకవర్గాన్ని వేరే వారికి అప్పగించండి. నాకు ఏదైనా ఇతర అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వండి. నేనే వెళ్తా. ఆ నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతా. వారితో కలిసి ఎస్ఐఆర్ విషయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తా..'

- మిగతా 2వ పేజీలో



## రుతుపవనాలు ఆలస్యం

సాధారణం కంటే వర్షపాతం 30% వరకు తగ్గే అవకాశం

పసిఫిక్ మహా సముద్రంలో ఎల్ నినో

వేడిగాలుల కారణంగా నైరుతి మందగమనం

అనివార్యంగా.. ఆలస్యంగా సాగు పనులు.. సెప్టెంబర్ నాటికి మరింత బలంగా ఎల్‌నినో

వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ, మే 29: దేశంలోకి ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక ఆలస్యంకానుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం ప్రకటించింది. అలాగే, గతేడాదితో

- మిగతా 2వ పేజీలో



## సీఎంగా నేడే డీకేఎస్ ఎంపిక

విధానసౌధలో సాయంత్రం 4 గంటలకు సీఎల్పీ భేటీ

శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఖరారు

సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించిన గవర్నర్

మంత్రివర్గంలో చోటు కోసం ఎమ్మెల్యేల యత్నాలు

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో సిద్ధరామయ్య, డీకేఎస్ భేటీ

కొత్త ప్రభుత్వ ఏర్పాటు, కేబినెట్ కూర్పుపై చర్చలు

సోమవారం డీకేఎస్ ప్రమాణ స్వీకారం

-2లో



తెలంగాణలో

## 2న జనసేన కీలక సమావేశం

హాజరుకానున్న పార్టీ అధినేత పవన్‌కల్యాణ్

హైదరాబాద్, మే29: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిం చనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా హాజరవుతారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ భేటీలో తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాల గురించి కొన్ని కీలక అంశాలను పవన్ కల్యాణ్ ప్రస్తావించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో జనసేన భవిష్యత్తు కార్యాచరణ పైనా దిశానిర్దేశం చేసే అవకాశాలున్నాయి.

# వడదెబ్బతో 13 మంది బలి

## ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రోహిణి కార్తె ప్రవేశించడంతో రాష్ట్రంలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, తీవ్ర వడగాల్పుల ధాటికి జనం విలవిలలాడిపోతున్నారు. శుక్రవారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో అత్యధికంగా 46.3, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఎండతీవ్రత మునుపెన్నడూ లేనివిధంగా ఉండటంతో

- మిగతా 2వ పేజీలో






# కొనుగోళ్లలో మాదే రికార్డు



ఇప్పటికే 60 లక్షల టన్నులు కొనుగోలు చేశాం

ఏపీ 24, తమిళనాడు 12, మహారాష్ట్రలో 3 లక్షల టన్నులే సేకరణ

రైతులకు ఈ నెల 28 నాటికి రూ.11,050 కోట్లు చెల్లించాం

వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. సేకరణ టార్గెట్‌ను కేంద్రం ఏటా తగ్గిస్తోంది

బీజేపీ నేతలు కల్లాల చుట్టూ తిరిగే బదులు ఢిల్లీకి వెళ్లి టార్గెట్ పెంచాలి

బీఆర్ఎస్ హయాంలో టార్గెట్‌లో ఎన్నడూ 50శాతం మించి కొనలేదు

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ఎమ్మెస్పీ ప్రకటించి వదిలేస్తే.. పంటనంతా ఎవరు కొనాలి?: తుమ్మల

హైదరాబాద్, మే 29 (ప్రజాతీర్పు): ప్రస్తుత సీజన్‌లో దేశంలో అత్యధిక మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసింది తెలంగాణ ప్రభుత్వమేనని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుచేస్తే... ఏపీలో 24 లక్షలు, తమిళనాడులో 12 లక్షలు, మహారాష్ట్రలో 3 లక్షలు, కేరళలో 2 లక్షల టన్నులు మాత్రమే సేకరించారని చెప్పారు. కేంద్రం అనుమతిచ్చిన దానికి మించి రూ.16,479 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల

- మిగతా 2వ పేజీలో

# యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

సంఘటనలు ఎన్నడూ జరగలేదని గుర్తుచేసింది. యూపీఎస్సీ నుంచి పాఠాలు నేర్చుకోవాలని ఎన్‌టీఏకు హితవు పలికింది. నీట్(యూజీ)లో అవకతవకల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని రద్దు చేసేలా లేదా ఆ సంస్థను పునర్వ్యవస్థీకరించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నీట్ అభ్యర్థుల ఆందోళనల పరిష్కారం పట్ల ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ప్రవేశ పరీక్షలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. జూన్ 21న జరగనున్న నీట్--యూజీ రీటెస్ట్ కోసం కొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. పరీక్షలో అక్రమాలు జరిగితే విద్యార్థులకే కాకుండా వారి కుటుంబాలకు కూడా అది చాలా బాధాకరమైన విషయం అవుతుందని పేర్కొంది. వారు చాలా భావోద్వేగానికి గురవుతారని తెలిపింది. బాధ్యత ఎవరి భుజస్కంధాలపై ఉందో తెలిసినప్పుడే జవాబుదారీతనం ప్రభావవంతంగా ఉంటుందని స్పష్టంచేసింది.

### వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం: తుషార్ మెహతా

పరీక్షల్లో అక్రమాలు జరగకుండా ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందేనని తుషార్ మెహతా అన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని, పరిస్థితిని సమీక్షిస్తున్నారని వెల్లడించారు. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భవిష్యత్తులో ఎన్‌టీఏ పరీక్షల్లో పెన్ అండ్ పేపర్ విధానానికి బదులు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానాన్ని అమలు చేయడంతో పాటు, సైబర్ భద్రతను పెంచుతున్నామని తెలిపారు. ఐఐటీ తదితర సంస్థల నుంచి నిపుణులను భాగస్వాములను చేసి వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు తుషార్ మెహతా వివరించారు. చాలా సంస్థలు తాత్కాలికమైనవి కావడమే అసలు సమస్య అని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక సంస్థలో అత్యుత్తమంగా పనిచేసే అధికారిపైనే అందరూ ఆధారపడతారని పేర్కొంది. దేశమంతటా ఇదే పరిస్థితి కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. సామర్థ్యం అనేది సంస్థకు ఉండాలని సూచించింది. అందుకే సంస్థను గొప్పగా పనిచేసేలా తీర్చిదిద్దాలని ఉద్ఘాటించింది.

### సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయండి

తాము మే 25వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుకు అనుగుణంగా ఎన్‌టీఏ డైరెక్టర్ (లీగల్) ఒక అఫిడవిట్ దాఖలు చేశారని ధర్మాసనం పేర్కొంది. అఫిడవిట్‌ను క్షుణ్నంగా పరిశీలిస్తామని తెలియజేసింది. ఎన్‌టీఏలో సంస్కరణల కోసం 'ఇస్రో'మాజీ చైర్మన్ డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చేసిన సిఫార్సుల అమలు, భవిష్యత్ కార్యాచరణను సూచిస్తూ కె.రాధాకృష్ణన్ కూడా ఒక అఫిడవిట్ దాఖలు చేశారని ధర్మాసనం వెల్లడించింది. ప్రతి సంవత్సరం పరీక్ష నిర్వహణ, ముగింపు ప్రక్రియను ఏవిధంగా పూర్తిచేస్తారో తెలియజేస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024 లేదా 2026 పరీక్షల వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు, ఎన్‌టీఏకే భౌతికంగా, మేధోపరంగా అవసరమైన వనరులు అందుబాటులో ఉండాలన్నదే తమ ఉద్దేశమని ధర్మాసనం స్పష్టంచేసింది. ఆరు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి సూచించింది. తదుపరి విచారణను జూలై రెండో వారానికి వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో విచారణకు డాక్టర్ కె.రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. స్టీరింగ్ కమిటీ సిఫార్సుల అమలును ఎంతవరకు పర్యవేక్షించారని ధర్మాసనం ఆయనను ప్రశ్నించింది. నీట్(యూజీ)లో వైఫల్యం ఎలా జరిగిందో చెప్పాలని సూచించింది. ఒకవేళ కమిటీ సిఫార్సు ఆధారంగా పర్యవేక్షణ జరిగినప్పటికీ, ఈ వైఫల్యం జరిగి ఉంటే.. అసలు సిఫార్సుల్లో లోపం ఉన్నట్లేనని అభిప్రాయపడింది. భవిష్యత్తులో తలెత్తబోయే పరిస్థితులను కమిటీ ఊహించలేకపోయినట్లే అవుతుందని తెలిపింది. రాధాకృష్ణన్ బదులిస్తూ.. ఇప్పటికే చాలా సిఫార్సులను అమలు చేయడం ప్రారంభమైందని అన్నారు. 2025లో నీట్(యూజీ)ని సంతృప్తికరంగా నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఒకటి రెండుసార్లు విద్యుత్ అంతరాయం మినహా ఎలాంటి తప్పిదాలు జరగలేదన్నారు.

### 2027 నుంచి సీబీటీ విధానం

నీట్(యూజీ) పరీక్షలో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నామని ఎన్‌టీఏ తెలియజేసింది. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) నిర్వహించబోతున్నట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టంచేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్--యూజీని సీబీటీ విధానానికి మార్చాలని ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ సిఫార్సు చేసినట్లు తెలిపింది. కేవలం ఈ ఏడాది మాత్రమే నీట్(యూజీ) ప్రధాన పరీక్షను పెన్, పేపర్(పీపీటీ) విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. మిగతా అన్ని ప్రధాన ఎన్‌టీఏ పరీక్షలను ఇప్పటికే సీబీటీ విధానంలో నిర్వహిస్తున్నట్లు గుర్తుచేసింది.

# వడదెబ్బతో 13 మంది బలి

(మొదటి పేజీ తరువాయి)

పగటిపూట ప్రజలు బయటరావడానికి జంకుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ ప్రభావంతో వేర్వేరు ప్రాంతాల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో 46.2డిగ్రీలు, ఓదెలలో 46.1, అంతర్గాం మండలం ఆకెనపల్లిలో 45.9, పాలకుర్తి మండలం ఈసాల తక్కెళ్లపల్లి 45.7, జగిత్యాల జిల్లా నేరెళ్లలో 46, అల్లీపూర్‌లో 45.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలో 44.6 డిగ్రీలు, మోస్రాలో 44.6, బిచ్కుంద 44.9, మద్నూర్ 44.7, పిట్లం 44.6, గాంధారి 44.5, ఎల్పుగొండ 44.4, కొల్లూర్ 44.2, జుక్కల్ 43.9, బోధన్, సాలూర, పోతంగల్, డొంకేశ్వర్, బాల్కొండ, మెండోర, ముప్కాల్‌లలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మధ్యాహ్నం నుంచి వాతావరణం మబ్బులతో కొంత చల్లబడినట్లు కనిపించింది. కాగజ్‌నగర్ మండలం జంబుగాలో 46, భీంపూర్ మండలం అర్లి(టి)లో 45.0, జైనథ్‌లో 44.9, బోథ్ మండలం పొచ్చెరలో 44.8, తలమడుగు, ఉట్నూర్‌లో 44.7, బోరజ్‌లో 44.6, నిర్మల్‌లో 42 డిగ్రీలు నమోదయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం రాత్రి వీచిన గాలిదుమారానికి తోడు అక్కడక్కడ చిరుజల్లులు పడటంతో కాస్త ఉపశమనం లభించిందని అంతా భావించారు. శుక్రవారం వడగాలుల తీవ్రత కాస్త తగ్గినా ఎండ మాత్రం బాబోయ్ అనిపించింది. ఖమ్మం జిల్లాలో 42, భద్రాద్రి కొత్తగూడెంలో 41.6డిగ్రీల సెల్సియస్ సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రమైన ఎండల కారణంగా పొలం పనులు, కూలీ పనులకు వెళ్లినవారు పశువుల కాపరులు వడదెబ్బకు గురై మరణించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎండదెబ్బ కారణంగా ఏకంగా ఆరుగురు మృత్యువాత పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పశువుల కాపరి కోవాసి భీమయ్య(45), యారం చిన్నసుబ్బారెడ్డి(46), కార్పెంటర్ కళ్లకూరి వెంకట్‌రావు(62).. అలాగే, ఖమ్మం జిల్లా చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు (61), వ్యవసాయ కూలీ కటారు వెంకటేశ్వర్లు (58), పండ్ల వ్యాపారి ఆలకుంట రామకృష్ణ (50) మృతి చెందిన వారిలో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సామాన్ వీరన్న (68), రాచర్ల సంపత్ (55), తునికాకు కూలీ బండారి ప్రమీల (53), ఇంజపురి కనకయ్య(40) మృతి చెందారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు సంగీత (40), సిద్దిపేట జిల్లా చంద్లాపూర్‌కు చెందిన పురుమాండ్ల ఇంద్రసేనారెడ్డి (55), కామారెడ్డి జిల్లాకు గొర్రెల కాపరి కందూరి సాయన్న(65) ప్రాణాలు కోల్పోయారు.

# సీఎంగా నేడే డీకేఎస్ ఎంపిక

## విధానసౌధలో సాయంత్రం 4 కు సీఎల్పీ భేటీ.. శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఖరారు
- సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించిన గవర్నర్
- మంత్రివర్గంలో చోటు కోసం యత్నాలు
- ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో సిద్ధరామయ్య, డీకేఎస్ భేటీ
- కొత్త ప్రభుత్వ ఏర్పాటు, కూర్పుపై చర్చలు
- సోమవారం డీకేఎస్ ప్రమాణ స్వీకారం

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై పూర్తిస్థాయి స్పష్టత రావడంతో గందరగోళానికి తెరపడింది. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయడంతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ప్రభుత్వ పగ్గాలు చేపట్టడం దాదాపుగా ఖరారైంది. ఇందుకు అవసరమైన ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై కసరత్తు సాగుతోంది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వేర్వేరుగా ఢిల్లీకి చేరుకున్నారు. మంత్రివర్గంలో తమ అనుచర వర్గానికి చోటు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు బెంగళూరు విధానసౌధలో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) సమావేశం జరగనుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు పాల్గొంటారు. కాంగ్రెస్ అధిష్టానం సూచన మేరకు డీకే శివకుమార్‌ను సీఎల్పీ నేతగా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

### ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ అభ్యర్థిత్వాన్ని కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సూర్జేవాలా ప్రతిపాదించనున్నారు. ఈ ప్రతిపాదనకు పార్టీ ఎమ్మెల్యేలు ఆమోదం తెలపాల్సి ఉంది. సీఎల్పీ నేతను ఎన్నుకున్న తర్వాత ఎమ్మెల్యేల మద్దతు లేఖను లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు అందజేస్తారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని గవర్నర్‌కు తెలియజేస్తారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ ఆహ్వానిస్తే.. సోమవారం విధానసౌధ వద్ద కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ప్రమాణ స్వీకార శుభముహూర్తం కోసం ఆయన ఇప్పటికే జ్యోతిష్యులను సంప్రదించినట్లు సమాచారం. సోమవారం మంచి ముహూర్తం ఉందని వారు సూచించినట్లు తెలిసింది. విధానసౌధ ఎదుట ప్రమాణ స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకేఎస్

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను కలుసుకొని ధన్యవాదాలు తెలియజేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గం కూర్పుపై సుమారు గంటకు పైగా చర్చించారు. అలాగే సిద్ధరామయ్య రాజకీయ భవిష్యత్తుపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. జాతీయ రాజకీయాల్లోకి రావాల్సిందిగా ఆయనను మరోసారి ఆహ్వానించినట్లు సమాచారం. ఈ సందర్భంగా సిద్ధరామయ్య వెంట ఆయన కుమారుడు యతీంద్ర, సీనియర్ మంత్రి కేజే జార్జ్ కూడా ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఇప్పటివరకు తనకు అవకాశం కల్పించినందుకు, సహకరించినందుకు అధిష్టానం పెద్దలకు సిద్ధరామయ్య కృతజ్ఞతలు తెలిపారు. డీకే శివకుమార్ సైతం పార్టీ అగ్రనేతలను కలుసుకున్నారు. మంత్రివర్గంలో తన వర్గం ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది.

### రాజీనామాకు గవర్నర్ ఆమోదం

సిద్ధరామయ్య రాజీనామాకు గవర్నర్ గెహ్లాట్ శుక్రవారం ఉదయం ఆమోదం తెలిపారు. రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు. ఈ మేరకు గెజిట్ విడుదల చేశారు. నూతన సీఎం ప్రమాణస్వీకారం చేసేదాకా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యను గవర్నర్ కోరారు. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కేపీసీసీ ఆదేశించింది. ఢిల్లీలో ఉన్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, రణదీప్ సింగ్ సూర్జేవాలా శుక్రవారం రాత్రి బెంగళూరుకు తిరిగి వచ్చారు.

### మంత్రి పదవుల కోసం లాబీయింగ్

కొత్తగా ఏర్పడనున్న మంత్రివర్గంలో చోటు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లాబీయింగ్ ప్రారంభించారు. చాలామంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హైకమాండ్‌తో మంత్రివర్గ కూర్పుపై సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో మంత్రుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. తమ సన్నిహిత ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కేలా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నారు. తమ వర్గానికి అత్యధిక మంత్రి పదవులు దక్కించుకునేందుకు ఇరువురు నేతలు పోటీ పడుతున్నారు. ఈసారి మంత్రివర్గంలో కొత్తముఖాలకు ఎక్కువగా ప్రాధాన్యం దక్కుతుందని ఊహాగానాలు సాగుతున్న తరుణంలో సీనియర్ మంత్రులు, ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గీయుల్లో టెన్షన్ పెరుగుతోంది.

### సిద్ధరామయ్యపై డీకేఎస్ పొగడ్తల వర్షం

డీకే శివకుమార్ 'ఎక్స్'లో సిద్ధరామయ్యపై పొగడ్తల వర్షం కురిపించారు. "దేవుడు వరం ఇవ్వడు, శాపం కూడా ఇవ్వడు, అవకాశం మాత్రం ఇస్తాడు. ఆ అవకాశంతో ఏం సాధిస్తామనేది ముఖ్యం" అంటూ వేదాంత ధోరణిలో స్పందించారు. అవకాశాలను అందిపుచ్చుకుని విజయం స్యాధించిన వారిలో ముఖ్యుడు సిద్ధరామయ్య అని కొనియాడారు. మైసూరు జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించి, పోరాటం ద్వారా రాజకీయాల్లోకి వచ్చి, సామాజిక న్యాయం అందిస్తూ, పేదల పెన్నిధిగా, కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య సేవలందించారని డీకే శివకుమార్ ప్రశంసించారు. కర్ణాటక రాజకీయ చరిత్రలో అత్యంత విజయవంతంగా, దీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా పనిచేసి సామాన్య ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారని ఉద్ఘాటించారు. నూతన మంత్రివర్గ ఏర్పాటుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఢిల్లీలో డీకే శివకుమార్ తెలిపారు.

# కొనుగోళ్లలో మాదే రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

అయిలయ్య, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిలతో కలిసి సచివాలయంలో మంత్రి ఉత్తమ్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ధాన్యం, బియ్యం సేకరణ కోటా కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. ఒకవైపు రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. కేంద్రం ఎఫ్‌సీఐ సేకరణ టార్గెట్‌ను ఏటా తగ్గిస్తోందని విమర్శించారు. బీజేపీ నేతలు కల్లాల చుట్టూ తిరిగేబదులు, ఢిల్లీకి వెళ్లి అదనపు కోటా తీసుకురావాలని సూచించారు. ధాన్యం సేకరణపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 8,575 సెంటర్లలో కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని, చివరి ధాన్యం గింజను కొనుగోలుచేసేదాకా సెంటర్లను తెరిచే ఉంచుతామని తెలిపారు.

### టార్గెట్‌కు మించి ధాన్యం కొనుగోళ్లు

రాష్ట్రంలో యాసంగిలో 141 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే, 75 లక్షల టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కేంద్రం కేవలం 52 లక్షల టన్నులకే అనుమతి ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 24 లక్షల టన్నులు కొనుగోలు చేస్తోందని వివరించారు. 13,000 వాహనాల్లో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారని, 2 లక్షల మంది సిబ్బంది అందుకోసం పనిచేస్తున్నారని వివరించారు. 2,008 రైస్‌మిల్లులు, 20.86 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీనాటికి రూ.11,050 కోట్లు రైతులకు చెల్లించినట్లు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కేకొంటామని అన్నారు. 60 లక్షల టన్నుల్లో 10 వేల టన్నులు తడిస్తే బాయిల్డు మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. ఇసుక, సిమెంటు లారీలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గత పాలకులు పదేళ్లలో ఏటా సగటున రూ.15 వేల కోట్ల ఎమ్మెస్పీ చెల్లిస్తే... తాము ఏడాదికి రూ.49 వేల కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం విధించిన టార్గెట్‌లో 50- 60 శాతమే కొనేవారని విమర్శించారు.

### ప్రజలు అసహ్యించుకునేలా బీజేపీ తీరు: తుమ్మల

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఇంగిత జ్ఞానంలేకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మండిపడ్డారు. వాస్తవాలు వక్రీకరించి, ప్రజలు అసహ్యించుకునేలా బీజేపీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పంజాబ్, హరియాణా తదితర రాష్ట్రాల్లో పండిన పంటనంతా కేంద్రం కొనుగోలు చేస్తూ.. తెలంగాణ రైతులకు మాత్రం ద్రోహం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో మిగిలిన కోటి టన్నుల ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. మక్కలు క్వింటాలుకు కేంద్రం రూ.2,400 ఎమ్మెస్పీ ప్రకటించి వదిలేస్తే రైతులు రూ.1,400 - 1,500లకే అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు. కేంద్రం ఎమ్మెస్పీ ప్రకటించి చేతులెత్తేస్తే ఎవరు కొనాలని తుమ్మల నిలదీశారు. 11 లక్షల టన్నుల యూరియా కావాలని 3 నెలలుగా కోరుతుంటే.. 10 లక్షల టన్నులు ఇస్తామని చెప్పి, 5 లక్షల టన్నులు కూడా పంపలేదని విమర్శించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తమ సమావేశాలకు రైతులు రాకపోవటంతో బీఆర్ఎస్ నేతలు మిలిటెంట్ తరహా పోరాటాలకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల నుంచి ప్రజల దృష్టిని మళ్లించటానికే బీజేపీ రైతుగోస యాత్ర చేపట్టిందని విమర్శించారు. వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే.. అందుకు కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# నాకూ మినహాయింపొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 45 లక్షల పార్టీ సభ్యత్వం చేర్పించామని, పార్టీ సభ్యులు ఒక్కొక్కరు ఇంకో ఓటు వేయించడంతో పార్టీ అధికారంలోకి వచి?చందని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలవాలని, ఇందుకోసం కనీసం కోటి ఓట్లు రావాల్సి ఉంటుందని అన్నారు. అలా రావాలంటే పార్టీకి సంబంధించిన ఒక్క ఓటు కూడా ఎస్ఐఆర్ ద్వారా పోకుండా ఉండాలని, ఇందుకు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా ఉన్న నేతలు, మంత్రులతో సహా అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ఇందిరాభవన్‌లో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), అడ్వైజరీ కమిటీ సమావేశాల్లో ముఖ్యమంత్రి మాట్లాడారు.

### ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తేలిగ్గా తీసుకోవద్దు

'ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ఈ కార్యక్రమంపై పార్టీ పక్షాన అవగాహన పెంచుకోవాలి. ఎస్ఐఆర్ కారణంగా వలసదారుల ఓట్లకు ఇబ్బంది రావచ్చు. వారి ఓట్లు పోకుండా చూడాలి. లంబాడీ, ఆదివాసీ, మైనార్టీ, దళిత, మహిళా ఓట్ల విషయంలో సమస్యలు రావచ్చు. ఈ సమస్యల పరిష్కారమెలా అన్న దానిపై బూత్‌స్థాయి కార్యకర్తలకు అవగాహన కల్పించాలి. గతంలో పార్టీ డిజిటల్ సభ్యత్వం చేర్పించిన వారికి ఈ విషయంలో కీలక బాధ్యతలు అప్పగించాలి. ఎస్ఐఆర్ కోసం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు, 17లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించాలి. అసెంబ్లీ ఇన్‌చార్జులు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే. వారు సరిగా పనిచేస్తేనే ఓట్లు పోకుండా ఉంటాయి. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్‌లోని నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించాలి. హైదరాబాద్ నగర పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలి. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్లస్టర్ వారీ సమావేశాలు నిర్వహించాలి..' అని సీఎం సూచించారు. కొందరు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సోషల్ మీడియాలో శిక్షణ ఇవ్వాలి

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కేడర్ పూర్తిగా సోషల్ మీడియా వారియర్లుగా మారిపోయి పనిచేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు మనం సోషల్ మీడియాలో వీక్ అయ్యాం. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లు అయ్యారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ప్రచారం తప్ప పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనివ్వడం లేదు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు రీచ్ కావడం లేదు. ఎమ్మెల్యేలు పాల్గొన్న కార్యక్రమాలు, ఎంపీలు కొబ్బరికాయలు కొట్టిన కార్యక్రమాలే సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. పార్టీ కోసం ఎలాంటి ప్రచారం జరగడం లేదు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు సోషల్ మీడియాలో శిక్షణ ఇవ్వాలి. నేతలు ఈ తీరును సరిచేసుకోవాలి.

### నెలలో మూడు రోజులు పార్టీకి..

నేతలు కార్యకర్తల వద్దకు వెళితేనే, కార్యకర్తలు బూత్‌స్థాయిలో ఓటరు వద్దకు వెళ్తారన్న విషయాన్ని గమనించాలి. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు కూడా కార్యకర్తల వద్దకు వెళ్లి కలవాలి. నేను కూడా 10 రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీ కార్యకర్తలను కలుస్తా. నెలలో మూడు రోజులు పార్టీకి కేటాయిస్తా. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లందరూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి..' అని సీఎం చెప్పారు.

### కార్యకర్తల్లో నిరుత్సాహం

పలువురు మంత్రులు, పార్టీ నేతలు మాట్లాడుతూ ఎస్ఐఆర్‌తో పాటు పార్టీ నిర్మాణంపై పలు సూచనలు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల నియామకంలో ఆచితూచి వ్యవహరించాలని, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని, సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారని చెప్పారు.

# రుతుపవనాలు ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి)

పోలిస్తే ఈసారి తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. గడిచిన మూడేళ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదని, వర్షపాతం 30 శాతం వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళంను తాకాల్సిన రుతుపవనాలు ఈసారి కాస్త ఆలస్యంగా ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో 'ఎల్ నినో' ప్రభావం తో సంభవించిన వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. వాస్తవానికి మే 26వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళంను తాకనున్నాయని ఐఎండీ గతంలో అంచనా వేసింది. కానీ, ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనా లు తలకిందులయ్యాయి. ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకోవడం, భూగర్భ జలాలు ఇంకిపోతున్న తరుణంలో ఈ ప్రకటన దేశ రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడే పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలపై తీవ్రప్రభావం పడనుంది. అలాగే, దక్షిణాదిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకపైనా వానాకాలం పంట కాలం ఆలస్యంగా మొదలుకానున్నది. సాధారణంగా రైతులు జూన్ ఆరంభంలోనే వ్యవసాయ పనులు మొదలుపెడతారు. పత్తి, మక్కలు, సోయాబీన్, వేరుశనగ వంటి విత్తనాలు నాటుతారు. వరి నారుమళ్లు సిద్ధం చేస్తారు. కానీ, రుతుపవనాలు ఆలస్యం వస్తుండటంతో సాగు పనులూ ఆలస్యంగా మొదలవనున్నాయి. సకాలంలో వర్షాలు పడకపోతే విత్తిన విత్తనాలు మొలకెత్తకుండా ఎండిపోయే ప్రమాదం ఉంది. అలా గే, వర్షాలు ఆలస్యం కావడం విద్యుత్ రంగానికి తీవ్ర సవాల్‌గా మారనుంది. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో రోజువారీ గృహ, పారిశ్రామిక రంగాలకు విద్యుత్ డి మాండ్ పెరగుతుంది. దీంతో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్లాంట్లపై ఒత్తిడి పెరుగుతుంది. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి లేకపోతే, అనివార్యంగా ప్రభుత్వాలు విద్యుత్ కోతలు విధించాల్సి ఉంటుంది. వ్యవసాయ దిగుబడులు తగ్గడం వల్ల మార్కెట్‌లో ఆహార ధాన్యాల సరఫరా తగ్గుతుంది. దీనివల్ల పప్పుధాన్యాలు, కూరగాయలు, వంట నూనెల ధరలు పెరుగుతాయి.



## ఆర్పి గార్డెన్ లో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్న తాళ్ల గురజాల పోలీసులు

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 29**

గురువారం సాయంత్రం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పరిధిలోని తిరుమల హిల్స్ దగ్గర ఆర్,పి,గార్డెన్ లో పేకాట ఆడుతున్నారని సమాచారం రాగా, తాళ్ల గురజాల ఎస్సై రామకృష్ణ తన సిబ్బంది తో అట్టి పేకాట స్తావరం పై రైడ్ చేయగా అక్కడ పేకాట ఆడుతున్న 1) జీ. క్రాంతి కుమార్ 2) ఐ. శ్రీనివాస్ 3) ఘా. పోశం 4) తొంగల వెంకటేష్ 5) గొడిశాల మణిరాజ్ 6) గాజు గంగాధర్ 7) సింగతి రవి 8) సలేందర్ కేశవ్ 9) ఎండీ,హాఫీజ్ అను 9 మందిని పట్టుకోవడం జరిగింది. వారి వద్ద నుండి 1,28,240/- ల రూపాయలు, 104 పేక ముక్కలు మరియు 8 సెల్ ఫోన్స్ స్వాదినం చేసుకొని అట్టి 9 మంది పైన కేసు నమోదు చేయడం జరిగింది. తాళ్ల గురుజాల ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## 16వ వార్డులో చీరల పంపిణీ: కార్యక్రమం లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి దొడ్డాకిరణ్ మిత్ర

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) మే29**



16వ వార్డులో చీరల పంపిణీ: కార్యక్రమం జరిగింది మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిఉందని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాలతో కౌన్సిలర్ శ్రీమతి ఉల్లింగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి దొడ్డా కిరణ్ మిత్ర హాజరై మహిళలకు స్వయంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మహిళలకు నిజమైన అభివృద్ధి జరుగుతోంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హూలు వినియోగించుకోవాలి. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలుఅందిస్తున్నాం. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తున్నాం" అని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్శ్రీమతి దొడ్డా కిరణ్ మిత్ర పుట్టినరోజును పురస్కరించుకొని మహిళలు చైర్పర్సన్ వారితో పాటుకౌన్సిలర్ శ్రీమతి ఉల్లింగ విజయలక్ష్మి శాలువాతో సన్మానించారు. అనంతరం చైర్పర్సన్ తో కేక్ కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్ శ్రీమతి ఉల్లింగ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో, చైర్పర్సన్ శ్రీమతి దొడ్డ కిరణ్ మిత్ర సూచనలతో వార్డులోని ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు చేరవేస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకురాళ్లు, కాంగ్రెస్ నాయకులు,వార్డు ప్రజలుపాల్గొన్నారు




## కుభీర్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి - - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 29**

నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో రైతు వేదిక నందు ఈ రోజు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్, చెక్కులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, లబ్ధిదారులకుఅందజేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 80 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు లబ్ధిదారుల పాల్గొన్నరు.




## టి పి టి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జండా ఆవిష్కరణ.

### పాల్గొన్న అధ్యక్ష ,కార్యదర్శులు, మండల నాయకులు

**(పగడాల రామారావు ప్రజాతీర్పు గార్ల మండల ప్రతినిధి ,)మే 29**

గార్ల.. స్థానిక మండల కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గార్ల ప్రధానోపాధ్యాయులు శీలంశెట్టి వెంకటేశ్వర్ల టీపిటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, డి ఏ బకాయిలను జారీ చేయాలని, ప్రీ ప్రైమరీ అన్ని ప్రాథమిక పాఠశాలకు వర్తింపచేయాలని, విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయి లను ఏకకాలంలో చెల్లించాలని, విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం కేటాయించాలని మండల అధ్యక్ష కార్యదర్శులు పాపావత్ యాదగిరి నాయక్, జి బాలాజీ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పండిట్లను పిఈటి పోస్టులను అప్గ్రేడ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు జి సంతు రామనాథం, రమేష్ అజ్మీర సామాన్ నాయక్, కన్నయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 29(ప్రజాతీర్పు ):**



జిల్లాలో ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ రైస్ మిల్లుతో పాటు కడెం మండలంలోని లక్ష్మీ అన్నపూర్ణ రైస్ మిల్లు, నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం, రోజువారీ సగటు అన్లోడింగ్ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిల్లుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. స్థానిక అధికారులు రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలు, సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## సిబ్బంది సమయస్ఫూర్తి.. రాత్రికి రాత్రే విద్యుత్ పునరుద్ధరణ

### విద్యుత్ అధికారులకు బస్తీవాసుల కృతజ్ఞతలు

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 29**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ ఏరియా తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో గురువారం సాయంత్రం గాలిదుమారంతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ ఈదురు గాలుల ధాటికి ఓ భారీ వృక్షం విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో, స్తంభం విరిగిపోయి బస్తీ వ్యాప్తంగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ?ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో, రాత్రి వేళ కరెంట్ లేకపోతే పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడతారని బస్తీవాసులు ఆందోళన చెందారు. స్థానికుల అభ్యర్థన మేరకు విద్యుత్ శాఖ డీఈ రాజేశం, ఏఈ మల్లేశం, తక్షణమే స్పందించారు. వారు అసిస్టెంట్ లైన్‌మన్ తిరుపతిని అప్రమత్తం చేయడంతో, విద్యుత్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ?రాత్రి సమయమైనప్పటికీ, ఎండకాలం ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. విరిగిపడిన చెట్టును తొలగించి, రాత్రికి రాత్రే విద్యుత్ అందించారు మరుసటి రోజు కొత్త పోల్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయాన్ని తొలగించారు. సకాలంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి బస్తీలో మళ్లీ వెలుగులు నింపారు. ?విపత్తు సమయంలో అడగగానే స్పందించి, రాత్రి అని కూడా చూడకుండా కష్టపడి కరెంట్ సరఫరా చేసిన డీఈ రాజేశం, ఏఈ మల్లయ్య, లైన్‌మన్ తిరుపతి మరియు సిబ్బందికి బస్తీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ?ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఎండ అనక, వాన అనక మనకోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేసే విద్యుత్ సిబ్బంది సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఇలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కరెంట్ పోతే అధికారులను తప్పుబట్టకుండా, వారికి మన వంతు సహకారం అందించాలి అని పేర్కొన్నారు.

## ఏసీ పేలి సీసీఐ తొలి చైర్మన్.. ధనేంద్రకుమార్ మృతి!

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మొదటి చీఫ్ ధనేంద్ర కుమార్ బుధవారం అర్ధరాత్రి తన ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఊపిరాడక చనిపోయారు. ఎయిర్ కండీషనర్ పేలి పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ధనేంద్ర కుమార్ ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. అగ్ని ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది కుమార్ ఇంటికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కుమార్ కొడుకుకు ప్రాణాపాయం తప్పింది.

## మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. సత్తు మల్లేష్

**(శరత్ రావు, ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్) మే 29**



మహిళల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, పేద కుటుంబాలకు చెందిన మహిళల ముఖాల్లో చిరునవ్వులు నింపాలనే సంకల్పంతో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. సత్తు మల్లేష్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని 23వ డివిజన్ సీతారాంపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలు, పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, నూతన రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అదేవిధంగా సహకార సంఘాల్లో పనిచేస్తున్న మహిళలకు అందించే వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. మహిళల సాధికారత, సంక్షేమం కోసం రానున్న రోజుల్లో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని డా. సత్తు మల్లేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## మే 31న సిద్దార్థ స్మారక పురస్కారాలు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 29.**



ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు సిధార్థ 14 వ స్మారక స్రవంతి అవార్డ్స్, పురస్కారాలు : రాష్ట్ర తెలుగు నాటక రంగంలో నటులుగా, దర్శకులుగా, రచయితగా, జర్నలిస్టుగా, వైద్య శాఖ అధికారిగా, చల్లూరు, మెట్టుపల్లి, కరీంనగర్ కేంద్రంగా మూడు దశాబ్దాలకు పైగా వివిధ నాటక సంస్థలను స్థాపించి, నిర్వహించిన, తెలుగు నాటక రంగానికి అద్వితీయ సేవలశీదించిన స్వర్గీయ సిధార్థ అలియాస్ గరువందుల నారాయణ 14 వ స్మారక స్రవంతి అవార్డులు, పురస్కారాలను ఈ నెల ( మే )31 న జగిత్యాల శ్రీ విశ్వ గాయత్రి పరివార్ జ్ఞాన మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు శాతవాహన కళా స్రవంతి( 1984 స్థాపితము) కరీంనగర్, అభినయ కళా నికేతన్ జగిత్యాల సంస్థల అధ్యక్షులు వై యస్ శర్మ, కొమురవెల్లి లక్ష్మీనారాయణలు తెలిపారు. విద్య, వైద్యం, పత్రిక, నాటక, రచన రంగాలలో ప్రముఖులకు ఈ అవార్డ్స్, పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు శాతవాహన, అభినయ కళా సంస్థలు తెలిపాయి. స్వర్గీయ సిధార్థ తో అనుబంధం వున్న బంధు, మిత్రులు, కళాకారులు, జర్నలిస్టు, వైద్య ఉద్యుగులు, రచయితలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

# తెలంగాణ ఐ. కె పి.వి .ఓ ఏ. స్ జాయింట్ యాక్షన్. జె ఏ సి.సెర్ప్ నిరవధిక సమ్మె

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) మే 29**



ఇల్లందు :భద్రాది కొత్తగూడెం జిల్లా మండలం లో పనిచేస్తున్న ఐకేపీ మరియు సెర్ఫ్ అనుబంధ.వి ఓ ఏ. స్ ఉద్యోగులు , తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ , నిరాహార దీక్షా కొనసాగిస్తున్న క్రమంలో ,శుక్రవారం బి ఆర్ స్ పార్టీ నాయకులు నిరాహార దీక్షా శిభిరంను సందర్శించి , 12 రోజులుగా సమ్మె చేస్తున్న వి ఓ ఏ లకు మద్దతు తెలియచేసి సంఘీభావం ప్రకటించడం జరిగినది. మరియు వారి న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కరించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేయడం జరిగినది . ఈ సందర్భంగా బి. ఆర్ .స్ పార్టీ వ్యవస్థపాక సభ్యులు మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ , కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు తమ ఎన్నికల ప్రణాళికలో పొందు పరిచిన మేరకు వి ఓ ఏ ల వేతనాలు పెంచాలని , +. వా. చీశీ. 58 ని సవరించాలని , అర్హులైన వి ఓ ఏ లను కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా నియమించాలని డిమాండ్ చేయడం జరిగినది . రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో వివిధ వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి 2 1/2 సంవత్సరాలు గడిచినా, ఇచ్చిన హామీలను అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలను వంచన చేసి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహారిస్తున్నదని , మీ సమస్యల పరిష్కారం కోసం తుద వరకు పోరాటం చేయాలని , దీ=ూ పార్టీ మీ సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల సహాయ సహాకారాలు అందిస్తుందని హామీ ఇవ్వడం జరిగినది .బిఆర్ స్ పార్టీ ప్రతినిధి బృందనికి వి ఓ ఏ ల జేఏసీ నాయకురాలు శ్రీమతి . నవ్య స్వాగతం పలికి తమ సమ్మె కు గలకారణాలను వివరించడం జరిగినది శ్రీఈ కార్యక్రమంలో టౌన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, నారపాక వసంతరావు, పరికపల్లి రవి గౌడ్, రాచపల్లి శీను, సన రాజేష్,మూల గుండ్ల ఉపేందర్ రావ్, లలిత్ కుమార్ పాసి, వంగ సునీల్ కుమార్, శ్రీకాంత్, మునగంటి శివ,సన రాజేష్, గడ్డి శ్రీనివాస్, ఎండి అమీర్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.



## S I R పై అవగాహన సదస్సు

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 29**

సదస్సువేములవాడ పట్టణ అర్బన్ బీజేపీ శాఖ ల ఆధ్వర్యంలో ూ × = పై అవగాహన సదస్సు ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడి. ఈ సందర్భంగా ముందుగా స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎస్ ఐ ఆర్ అవగాహన సదస్సు కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం సర్ ప్రోగ్రామ్ అని ఈ కార్యక్రమం ద్వారా దేశంలో ఉన్న బోగస్ ఓట్లను ఏరివేయాడమే కాకుండా దేశ భవిష్యత్తు కోసం పునాదులు వేయబడుతున్నాయని అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వక్తగా విచ్చేసిన అల్లాడి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహిస్తున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రంలో కూడా ఒక ఓటర్కు పలుచోట్లలో ఉన్న ఓట్లను తొలగించడం ఓటుకు భద్రత కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు ప్రతాప రామకృష్ణ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త బూత్ అధ్యక్షులు అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని మీమీ వార్డులో ఉన్న డబల్ ఓట్లను బోగస్ ఓట్లను గుర్తించేలా సహకరించాలని అన్నారు తదుపరి కార్యక్రమం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడించిన బిజెపి అర్బన్ అధ్యక్షులు బుర్ర శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత 15 రోజుల క్రితం ఎమ్మార్వోకు వినతిపత్రం ఇచిన్నప్పటిని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో ఉండి పెట్రోల్ డీజిల్ రెట్లు పెరిగాయని ధర్నాలు చేయడం కాదు రైతుల కోసం కూడా ముందుండి కొట్లాడాలని హితవు త్వరితగతిన రైతులకు మేలు చేయకపోతే రానున్న రోజుల్లో అన్ని గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు మీకు బుద్ధి చెబుతారని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంచి మహేష్ రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్ లింగంపల్లి శంకర్ ఏరెడ్డి రాజిరెడ్డి,మల్లేశం కౌన్సిలర్లు కొండ్లెపు చిన్న ముత్యం మంగళ శ్రీనివాస్ నాయకులు పిన్నింటి హనుమాన్లు ఏరెడ్డి రాజిరెడ్డి రేగుల శ్రీకాంత్ మామిళ్ళ లక్ష్మీరాజ్యం వివేక్ రెడ్డి , గుండెకర్ల లక్ష్మణ్,కట్కం శ్రీనివాస్ అన్నం నరసయ్య సంజీవ్ రెడ్డి బిల్లా కృష్ణారి నామాల శేఖర్ బాలు రాంబాబు వాసశీ మల్లేశంప్రశాంత్ రాము సగ్గు రాహుల్ యశ్వంత్ రంజిత్ రెడ్డి పట్టణ మరియు అర్బన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## డీజిల్ ధరల పెంపుతో ఆటో కార్మికుల బ్రతుకులు భారంగా మారుతున్నాయి.. బి ఆర్ టి యు

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 29**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి : తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ ఫ్లై ఓవర్ కింద తాండూర్ ఆటో కార్మికుల సహకారంతో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పెరిగిన డీజిల్ ధరలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం డీజిల్ ధరలు పెంచడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. మూల్గే నక్క మీద తాటి పండు పడ్డట్టుగా ఆటో కార్మికుల పరిస్థితి తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డీజిల్ ధరలు తగ్గించాలని, లేకపోతే సింగరేణి సంస్థకు, ఆర్టీసీకి ఇస్తున్నట్లే ఆటో కార్మికులకు కూడా డీజిల్‌పై సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న జీఎస్టీని తగ్గించి ఆటో కార్మికులకు రాయితీ కల్పించాలని కోరారు. ఇంకా పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో ఆటో కార్మికులు సతమతమవుతున్నారని, ఈ సమయంలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ లేదా డీజిల్ ధరల తగ్గింపు నిప్పుల మీద నీళ్లు చల్లినట్టుగా ఉపశమనాన్ని ఇస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆటో కార్మికుల సమస్యలను అర్థం చేసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డీజిల్ ధరలను నియంత్రించకపోతే భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి సిద్ధమవుతామని హెచ్చరించారు. బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆదేశాల మేరకు అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్, అధికార ప్రతినిధి వేల్పుల శంకర్‌తో పాటు తాండూర్ మండలంలోని ఆటో కార్మికులు పాల్గొన్నారు.



## అగ్ని తాకిడికి దగ్ధమైన మామిడి తోట

- పరిశీలించిన నగునూరి నర్సగౌడ్....
- మామిడి తోట నష్టపరహారానికి సర్వే చేపట్టిన అధికారులు

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే29**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావు పేట గ్రామంలో 27 గురువారం రోజున అగ్నికి ఆహుతైన మామిడి తోట బంద్ర భూమక్క కాంతయ్య వారి రెండు ఎకరాల మామిడి తోటలో 70 మామిడి చెట్లు డ్రిప్పు పైపులతో సహా పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లగా ఆ విషయం తెలుసుకున్న బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి తెలియజేయగా, మంత్రి గారి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ నష్టం వాటిల్లన మామిడి తోట వద్దకు చేరుకొని పరిశీలించారు. పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్లో మాట్లాడి వారికి తెలియజేయగా! వ్యవసాయ అధికారి అక్షిత, ఆర్టికల్స్ అధికారి వంశీకృష్ణ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. వారు మామిడి తోటను పరిశీలించి, ఎంత నష్టం వాటిల్లంది అంటూ సర్వే చేపట్టారు. అధికారులు సర్వ చేపట్టిన తర్వాత మామిడి తోట బాధిత రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం అందే విధంగా ప్రయత్నిస్తామంటూ అధికారులు రైతు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నరస గౌడ్ కూడా మాట్లాడుతూ రైతు కుటుంబానికి నష్ట పరిహారానికి సరైన పారితోషికం ప్రభుత్వం నుండి అందే విధంగా సహకరిస్తామంటూ రైతుకు ధైర్యం చేకూర్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్స గౌడ్ వెంట యశ్వంతరావుపేట గ్రామ ఉపసర్పంచ్ కోల శ్రీనివాసు,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పెద్దనవేణి శంకర్, కాంగ్రెస్ నాయకులు సమిత్, కోల గంగన్న,పొన్నం రాహుల్ , బక్కన్న కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన సింగరేణి కార్మికుడు మంతెన భాస్కర్

- కీబోర్డు అద్భుతంగా వాయించినందుకు గాను ఘనత
- చిన్నప్పటినుంచి కీబోర్డుపై ఆసక్తి
- ప్రస్తుతం సింగరేణి శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధుల నిర్వహణ

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 29**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు, శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధులు నిర్వర్తిస్తున్న మంతెన భాస్కర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. గత ఫిబ్రవరి 2న హైదరాబాద్లో ని జొరాస్ట్రియన్ క్లబ్ లో గిన్నిస్ బుక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సమన్వయంతో జరిగిన సంగీత కార్యక్రమంలో 22 దేశాల నుంచి సుమారు 2000 మంది కీబోర్డు సంగీత వాయిద్యకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు. అందులో ప్రతిభ కనపరచిన కొంతమందిని గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు. అందులో బెల్లంపల్లి పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు మంతెన భాస్కర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం ఎంపికవ్వడం విశేషం.ఎంపిక అయిన మంతెన భాస్కర్ కు శుక్రవారం హైదరాబాదులోని గచ్చిబౌలిలో గల విక్టరీ ఆడిటోరియంలో జరిగిన "గిన్నిస్ అచీవర్స్ మీట్" కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్ అందజేశారు.

### కష్టాల్లోంచి కార్మికుడిగా...

ఇష్టపడి కీబోర్డు ప్లేయర్ గా ఎదిగిన మంతెన భాస్కర్

బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన మంతెన రాజయ్య పోసమ్మ దంపతుల మూడవ సంతానమే మంతెన భాస్కర్. భాస్కర్ కు అన్న రమేష్, అక్క రమా,తమ్ముడు సంజీవ్ ఉన్నారు. భాస్కర్ కు పదేళ్ల వయసు ఉన్నప్పుడే 1996లో తండ్రి రాజయ్య శాంతిఖనిలో గని ప్రమాదంలో మృతి చెందారు. అప్పట్నుంచి తల్లి పోసమ్మే నలుగురు పిల్లలను ధైర్యంతో పెంచి పెద్ద చేస్తూ వచ్చింది. భాస్కర్ అన్న రమేష్ కు వారసత్వంగా తండ్రి ఉద్యోగం వచ్చింది. రమేష్ తన చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లకు తండ్రి స్థానంలో ఉండి తన వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేసి ఎన్నో కష్టాలు పడి చదివించాడు. ఎన్నో అవమానాలు ఆర్థిక ఇబ్బందులను దాటుకుంటూ రమేష్ తన తల్లి సహకారంతో చెల్లెల్ని తమ్ముళ్లను ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. ఈ కష్టాల్ని, త్యాగాల్ని గమనిస్తూ పెరుగుతూ వచ్చిన భాస్కర్ బాగా చదువుకొని సింగరేణి సంస్థ 2018 లో ఇచ్చిన నోటిఫికేషన్ లో ఎలక్ట్రిషియన్ గా ఉద్యోగం సాధించినాడు 2018లో శాంతిఖని గనిలో ఎలక్ట్రిషియన్ గా విధుల్లో చేరారు. 2023లో సుప్రియను వివాహమాడారు. వీరికి కుమారుడు లియోనార్డో ఉన్నాడు.

### మంతెన భాస్కర్ కు ప్రశంసల వెల్లువ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు......

కుటుంబసభ్యులు ఎంతగానో అభినంధించినారు ఆనందంలో కుటుంబసభ్యులు సంబారాలు చేసుకున్నారు

భాస్కర్ పనిచేస్తున్న సింగరేణి సమస్త ఉన్నత అదికారులు, మరియు శాంతిఖని గని అధికారులు, తోటి కార్మికులు, యూనియన్ నాయకులు,బంధువులు, మిత్రులు ప్రశంసించారు.



## రాష్ట్రంలోని మహిళల ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా పథకాలు అమలు

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 29**

చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలి కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద మహిళా స్వయం సహాయక సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుణాల పంపిణీ.. 337 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 40 కోట్లు, ఎఫ్ పీసీ, ఎఫ్ పీజీ సీఐఎఫ్ కింద 42 సంఘాలకు రూ. 1 కోటి ఐదు లక్షలు, శ్రీనిధి రూరల్ కింద 278 సంఘాలకు రూ. 7 కోట్ల 13 లక్షలు, బ్యాంక్ లింకేజీ మెప్మా రుణాలు 55 సంఘాలకు రూ. 6 కోట్ల 33 లక్షలు, శ్రీ నిధి మెప్మా 61 సంఘాలకు రూ. కోటి 50 లక్షల విలువైన చెక్కులను మహిళా సంఘాల బాధ్యులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే సంఘాలకు రూ. 11,36,113 కమిషన్ చెక్కును అందజేశారు. స్టాళ్లు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పరిశీలించారు...

పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలి.

## ఐసిడిఎస్ సూపర్ వైజర్ శోభారాణి

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే 29**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్క పేట్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాలలో తొలి వెయ్యి రోజులు బంగారు భవిష్యత్తుకు పునాది అనే అంశంపై గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభారాణి మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు తాగించాలని, శిశువు అభివృద్ధి చెందడానికి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, అంగన్వాడి టీచర్లు నవనీత, రామలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



## మంచి నీళ్ల కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన దళితులు

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, మే 29,(ప్రజా తీర్పు )**

కాంగ్రెస్ పాలనలో మంచినీళ్ల కోసం దళిత ఆడబిడ్డలు అరిగోస పడుతున్నారు. పదేండ్ల తర్వాత ఖాళీ బిందెలతో రోడ్లపై ఆందోళనలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండలంలోని నారాయణపురం గ్రామపంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో గత 10 రోజుల నుంచి మంచినీళ్లు రాకపోవడంతో నిరసనగా శుక్రవారం కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మంచినీళ్లు రావడంలేదని స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా నీళ్లు దొరకడం లేదన్నారు. మార్పు అంటే ఇదేనా అని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రెండు రోజుల్లో మంచినీరు సౌకర్యం కల్పించకపోతే పెద్ద ఎత్తున మహిళలందరూ గ్రామపంచాయతీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు చిన్నారులు పాల్గొనడం విశేషం.

## పత్తికుంటపల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) మే 29**



పత్తికుంటపల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ జుట్టు శేఖర్ శుక్రవారం ప్రారంభించారు. 120 మీటర్ల పొడవుతో సుమారు రూ. 5 లక్షల అంచనా వ్యయంతో ఈ సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగానే ఈ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్, ఉప సర్పంచ్ మనోహర్ రెడ్డి, ఏఈ రాజేష్, గ్రామ కార్యదర్శి సాయి సుధ, వార్డు సభ్యులు,భారతి,పూజ,రాజమణి, రవి. భాస్కర్,చింతాలపల్లి చిన్న శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ ,రమణ రెడ్డిలు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం





### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 29**

మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, అధికారులతో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణ సదుపాయాల ద్వారా వివిధ వ్యాపారాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఎన్.ఆర్.ఎల్.ఎం., ప్యాడీ కమిషన్, పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. పథకాలలో హాజీపూర్ మండలంలో 382 యూనిట్లకు గాను 18 కోట్ల 7 లక్షల రూపాయలు, దండేపల్లి మండలంలో 316 యూనిట్లకు గాను 16 కోట్ల 79 లక్షల రూపాయలు, లక్షెట్టిపేట మండలంలో 512 యూనిట్లకు వారం 18 కోట్ల 23 లక్షల రూపాయలు, మొత్తంగా 1 వేయి 210 స్వయం సహాయక సంఘాలకు 53 కోట్ల 10లక్షల 75 వేల రూపాయలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి ద్వారా లబ్ధి పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, వారు ఆర్జించిన లాభాల నుంచి కొంత శాతం సంఘాల ఖాతాలలో పొదుపు చేయాలని, ప్రతి ఒక్కరికి సమాన లాభం చేకూర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, కమిటీ సభ్యులు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని, పిల్లలు హాజరు శాతం పెంచాలని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి అవకతవకులకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం రాష్ట్రంలోని మొదటగా పూర్తయిందని, ఈ అవకాశాన్ని సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఐకెపి వివో ఎలా నిరవధిక 12 వరోజు సమ్మె





## సమ్మెకు మద్దతు తెలిపిన స్థానిక ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 29**

నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయ ఆవరణలో ఐకెపి వివో ఏలు అన్ని నిరవధికంగా కొనసాగిస్తున్నారు. ఈరోజు 12 ఈరోజుకు 12వ రోజు చేరుకోవడంతో, ముధోల్ నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఐకెపి వివో ఏ లకు, కనీస వేతనంగా రూ 26000, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వివో ఎలుగా పనిచేస్తున్న సిబ్బందికి, సేర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కీలక పథకాల్లో ఐకెపిఓ వివోఏలు ఇస్తున్నారు అని పేర్కొన్నారు. ఐకెపి వివో ఏళ్లకు సరైన గౌరవం, హక్కులు కల్పించాలని త్వరలోనే వారికి ప్రభుత్వం అన్ని సమస్యలను తీర్చి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏల మండల అధ్యక్షుడు, సాయినాథ్, దేవిదాస్, తదితర మహిళా సిబ్బంది, బిజెపి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వరి కొయ్య కాళ్ళను కాల్చవద్దు

**చిగురుమామిడి మే 29 ప్రజా తీర్పు**

రైతులు వరి కొయ్య కాళ్లను కాల్చవద్దని ముదిమాణిక్యం సర్పంచ్ బోయిని రమేష్ రైతులకు సూచనలు చేశారు. ముదిమాణిక్యం గ్రామంలో వరి కొయ్యాకళ్ళను (పడే స్టబల్స్ ) కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ అధ్యక్షతన కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ....గ్రామంలో ఎవరూ పంట అవశేషాలను కాల్చకుండా నిఘరణి సమితి పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక వేళ రైతులు ప్రభుత్వ సూచనలను పాటించకుండా పర్యావరణ పరిరక్షణకు నష్టం చేకూరిస్తే ఫైన్ విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కావున రైతులు అందరూ సహకరించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ మాట్లాడుతూ... రైతులు పంట అవశేషాలను కాల్చకుండా మల్చర్ శ్రేడర్లతో వాటిని భూమిలో కలపి వేస్ట్ డికంపోజర్ సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లుకొని భూమిలో కుళ్లింపజేసి నేల సారాన్ని పెంచుకోవాలన్నారు. లేదా పశు వులకు మేతగా వినియోగించడం లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల ప్రణయ్ మాట్లాడుతూ.. వరి మిగులు అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతం తగ్గిపోవడం, గాలిలో కాలుష్యం పెరగడం, పర్యావరణానికి హాని కలగడం జరుగుతుందని వివరించారు. అలాగే మట్టిలో ఉన్న సూక్ష్మ జీవులు నశించి, భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ , ఏఎంసి డైరెక్టర్ కుత్బుద్దీన్, ఏఈ వో ప్రణయ్ ,పంచాయతీ సెక్రటరీ అరుణ్ , నిఘరణి సమితి సభ్యులు జక్కుల బాబు, చీల లక్ష్మారెడ్డి, పశ్చిమట్ల జగన్ , డోకి నరేష్ ,పశ్చిమట్ల మధుసూదన్ మరియు రైతులు పాల్గొన్నారు.

## కాసాని దంపతుల సౌజన్యంతో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, మే 29,(ప్రజా తీర్పు )**



ప్రస్తుతం వేసవి కాలం కావడంతో గత 20 రోజులుగా ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది, ఐతే ఉష్ణోగ్రతలు సైతం రికార్డు స్థాయిలో అశ్వారావుపేట మండలంలో 47 డిగ్రీలకు చేరుకుంటున్న తరుణంలో కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఇకపోతే నారాయణపురం గ్రామంలో పనిచేస్తున్న, ఉపాధి కూలీలు ఎండదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కాసాని చంద్రమోహన్ - నాగ శేష పద్మ దంపతుల సౌజన్యంతో ఉచితంగా చల్లటి మజ్జిగ ప్యాకెట్లు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయుకులు మీదుగా పంపిణీ చేశారు. ఈ మండుటెండల్లో తమ ఇబ్బందులను గుర్తించి, సకాలంలో స్పందించి మజ్జిగ పంపిణీ చేయడం పట్ల ఉపాధి హామీ కూలీలు హర్షం వ్యక్తం చేశారు. తమ దాహార్తిని తీర్చినందుకు కాసాని దంపతులకు ఉపాధి హామీ కూలీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చిన్నంశెట్టి వరలక్ష్మి, నారం అనురాధ, చందా కుమారస్వామి, కలపాల మంగా రాజు, కాటూరి నాగేశ్వరావు, కోటేశ్వరరావు, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.




## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జువెలరీ షో

**సిద్దిపేట మే 29(ప్రజా తీర్పు ప్రతినిధి )**

సిద్దిపేట పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్ లోశుక్రవారం ఆర్టిస్ట్రీ షోని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు,జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ అండ్ ఐ=.చందన రెడ్డి జూనియర్ ఆర్టిస్ట్ బేబీ లౌక్యం లు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టోర్ హెడ్ శారిక్ షరాఫ్ మాట్లాడుతూ తమ సంస్థలో ఆర్టిస్ట్రీ షో బ్రాండెడ్ జువెలరీ ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శన అని ఈ ప్రదర్శనలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు,జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఈ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యంతో అంతులేని హుందాతనంతో కూడినవని నగిషి చెక్కిన ప్రతి ఆభరణం కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రాండ్ల సమహారం మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు వివాహ విందు సంబరాల కోసం ఏరా అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి,ప్రెష్యా జాతి రత్నాభరణాల సముదాయం ఎథిక్స్ హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాల,జోల్ అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలను ఇష్టపడే మగువల మనసు దోచుకుంటాయి,డివైన్ భారతీయ ప్రాచీన సాంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు ఇంకా చిన్నారుల కోసం స్టార్లెట్ పిల్లల ఆభరణాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన జూన్ 1 వరకు కొనసాగుతుందని ఈ షో సందర్భంగా ప్రతి కొనుగోలు పై ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నామని రత్నాభరణాలు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్లు స్వామి వాజిద్ .భాస్కర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఎన్నికైన. క్యారే గారి శ్రీధర్ గారికి ఘన సన్మానం!

**(వై యాదగిరి ప్రజాతీర్పు రిపోర్టర్మహేశ్వరం ) మే. 29**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ డివిజన్ క్యారే గారి శ్రీధర్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శుభ సందర్భంగా శాలువాతో సత్కరించి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తాటి చెట్లు అగ్నికి ఆహుతి... గౌడ కుటుంబాల జీవనాధారానికి తీవ్ర నష్టం





**రామగిరి, మే-29(ప్రజాతీర్పు)**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పరిధిలో జరిగిన అగ్నిప్రమాదం గ్రామంలో విషాదాన్ని నింపింది. పంట పొలాల్లో కొయ్యకళ్లను కాల్చివేయడానికి రైతులు పెట్టిన మంటలు అదుపుతప్పి పక్కనే ఉన్న తాటివనానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అనేక తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో గౌడ కులస్తుల జీవనాధారం తీవ్రంగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న వెంటనే హుటా హుటిన ఉమ్మడి కమాన్ పూర్ మండలం మాజీ జడ్పీటీసీ, లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత గౌడ కుటుంబాలను పరామర్శిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాటి, ఈత చెట్లు గౌడ కుటుంబాలకు ప్రధాన జీవనాధారమని, ఒక్క చెట్టు కాలిపోవడం అంటే ఒక కుటుంబం ఆశలు, భవిష్యత్తు కాలిపోవడమేనని అన్నారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని కోరారు. అలాగే రైతులకు విజ్ఞప్తి చేస్తూ పొలాల్లో కొయ్యకళ్లను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా ఇలాంటి అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంటుందని తెలిపారు. కొయ్యకళ్లను నీటిలో మురగపెట్టి జమ్ము కొట్టినట్లయితే అది సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని, రైతులు అగ్ని ప్రమాదాలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అగ్నిప్రమాద సమయంలో గంట వెంకటరమణారెడ్డి, తోట చంద్రయ్య, బుచ్చయ్య, ముస్త్యాల శ్రీనివాస్, అవినాష్ గౌడ్, కాట రాజేందర్ గౌడ్, కాట మల్లయ్య, కాట శంకర్, వీరవెంకటసది, కుర్ర రమేష్, బూరుగు రమేష్ తదితరులు గ్రామస్తులతో కలిసి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. వారి ప్రయత్నాలతో పరిస్థితి కొంతమేర అదుపులోకి రావడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలకు నిప్పు పెట్టరాదు, ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడును

### ఎస్ఐ సిరిసిల్ల అశోక్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 29**



ఇల్లంతకుంట ఎస్ఐ సిరిసిల్ల అశోక్ మండల ప్రజలకు రైతులు పంట వ్యర్థాలను గడ్డిని వారి యొక్క పొలాలలో చేనులలో తగలబెట్టడం చేయకూడదు, ఇలా చేయడం వల్ల భూమిలోనీ సారం తింటుందని అలాగే పంటకు అవసరమైన బ్యాక్టీరియా అందకుండా చనిపోతుంది, కనుక ఇలా చేసిన వారిపై జీవో నెంబర్ 27 ప్రకారం చట్టరీత్యా సాధారణ వ్యర్థాలు కాల్చితే రూపాయలు 5000/- మరియూ భారీ ఎత్తున /ఎక్కువ విస్తీర్ణంలో కాల్చితే రూపాయలు 25000/- జరిమానాలు విధించడం జరుగుతుందని చట్టపరమైన సెక్షన్లు మరియూ కఠిన చర్యలు తీసుకోబడతాయి,అన్నారు ఇలాగే అంటు పెట్టడం వల్ల ఇతర రైతుల పంట పొలాలు మోటర్లు, పైపులైన్లు, విద్యుత్ వైర్లు, స్టార్టర్లు, ఆహుతయ్యాయని మంటలవల్ల అలాగే జంతువులకు, మనుషుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతుఉన్నట్లయితే నాన్ బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేయబడుతాయని ఇటీవల కాలంలో తాళ్లపల్లి గ్రామ శివారులో తన వరి పొలంలో గడ్డికి నిప్పు పెట్టగా ఎలుక నారాయణ అనే రైతు అదే మంటల వల్ల మరణించడం తెలిసిందే, అలాగే అనంతారం గ్రామపంచాయతీ పరిధిలో ఇలాంటి నిర్లక్ష్య పూరితమైన చర్యల వల్ల సుమారు 300 ఎకరాలలో నిప్పు అంటుకొని పదిమంది రైతులకు నష్టం వాటిల్లింది కావున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వారి పొలాలలో చేన్లలో పంట వ్యర్థాలను కాలపెట్టకూడదని దానికి ప్రత్యామ్నాయంగా ఇతరత్రా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలియజేసారు



## మాల వాగు వరద ముంపు సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టరేట్‌లో కన్నీటి పర్యంతమైన వెంకటాపురం 8వ వార్డు బాధితుల

**ఎల్లారెడ్డిపేట, మే 29 (ప్రజా తీర్పు)**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామం 8వ వార్డులోని 'మాల వాగు' పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతూ శుక్రవారం నాడు గల్లీ ముంపు బాధితులు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.....గత వానాకాలంలో మాల వాగు నీరు వెనక్కి తన్నడం వల్ల తమ ఇళ్లు, గుడిసెలు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిండి గింజలు కుళ్లిపోయి, సామాన్లు కొట్టుకుపోయి చిన్న పిల్లలతో రాత్రంతా రోడ్లపైనే గడిపామని, పక్కనే ఉన్న రైతుల పొలాలు కూడా పూర్తిగా నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని కలెక్టర్ కి వివరించారు. మళ్లీ వానాకాలం ముంచుకొస్తుండటంతో గల్లీ ప్రజలంతా నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, ఆకాశంలో చిన్న మబ్బు పట్టినా భయంతో వణికిపోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. తాము పడిన నష్టాల ప్రత్యక్ష సాక్ష్యాలైన ముంపు ఫొటోలను, గల్లీ ప్రజలందరి సంతకాల పట్టికను కలెక్టర్ కి చూపిస్తూ తమను ఈ వరద గండం నుండి కాపాడాలని వేడుకున్నారు. దీనిపై కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి త్వరలోనే పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం 8వ వార్డు ముంపు బాధితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 29**

జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పెద్దలింగాపూర్, దాచారం, చిక్కుడువానిపల్లి పలుగ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి, కొనుగోళ్ళ ప్రక్రియపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని వర్షాలు పడే అవకాశం ఉన్నందున సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తూకం వేసిన ధాన్యం లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్య పెంచుకుని కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయడంపై దృష్టి సారించాలని అవసరం మేరకు ట్రాక్టర్ లను సమకూర్చాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అధికారులు రైతులు తదితరులు పాలుగోన్నారు.

## కొర్వి అరుణ్ కుమార్‌కు ఘన సన్మానం

**రామడుగు, మే 29 (ప్రజాతీర్పు ప్రతినిధి)**




కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుగా రెండవ సారి నియమితులైన కొర్వి అరుణ్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అరుణ్ కుమార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి అంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ తాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కొత్తపల్లి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, కరీంనగర్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం లావణ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అబ్దుల్ అమీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కొర్వి అరుణ్ కుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మరోసారి బాధ్యతలు చేపట్టడం ఆనందకరమని, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలి


### యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ అధ్యాపకులు మ్యాదరి రాకేష్

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) మే 29**

యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో స్వయం ఉపాధి కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ అధ్యాపకులు మ్యాదరి రాకేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు మరియు గ్రామస్తులకు, భారత ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారి సహకారంతో మన జగిత్యాల జిల్లాలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (=ాజు×) ద్వారా నిరుద్యోగ యువతకు, వయస్సు 19-45 సంవత్సరాల వారు , పదవ తరగతి చదివిన వారికి ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తుందని,ఉచిత శిక్షణ కోర్సులు మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషియన్ , పుట్టగొడుగుల పెంపకం, జ్యూట్ బ్యాగుల తయారీ, ఇమిటేషన్ జ్యువలరీ, సిసిటివి ఇన్స్టాలేషన్ , మల్టీ ఫోన్ రిపేరింగ్, ఏసీ అండ్ ఫ్రిజ్ రిపేరింగ్, ఫోటో మరియు వీడియో గ్రాఫి, హౌస్ వైరింగ్ వంటి కోర్సులకు దరఖాస్తు చేసుకొని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు, శిక్షణలో ఉచిత భోజనం మరియు వసతి, శిక్షణకు కావలసిన మెటీరియల్, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, అర్హులైన వారికి బ్యాంకు లోను ఇప్పించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.ఇట్టి అవకాశాన్ని జగిత్యాల జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని,మరిన్ని వివరాలకి 9502869491 నంబర్ ను సంప్రదించాలని అన్నారు.ఈ సందర్భంగా అయిలాపూర్ గ్రామ సర్పంచ్ ధ్యావనపెల్లి రామకృష్ణ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్,సెల్ ఫోన్ రిపేరింగ్,మగ్గం వర్క్, సిసిటివి ఇన్స్టాలేషన్ఏసీ అండ్ ఫ్రిజ్ రిపేరింగ్,ఫోటో అండ్ వీడియో గ్రాఫి, హౌస్ వైరింగ్,బ్యూటిషియన్ లాంటి ఎన్నో ఉచిత కోర్సులు ఉన్నాయని ప్రతి ఒక్క నిరుద్యోగ యువతి, యువకులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అయిలాపూర్ గ్రామ సర్పంచ్ ద్యావనపెల్లి రామకృష్ణ,ఉప సర్పంచ్ వనపర్తి సౌమ్య ,వార్డు సభ్యులు,మహిళలు,వివోఏ లు,నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ హాస్పిటల్ లో రక్తదానం చేసిన జర్నలిస్ట్ దుర్గారావు

**చింతల్, మే 29 (ప్రజా తీర్పు)**



హైదరాబాదులోని నిమ్స్ హాస్పటల్లో అత్యవసర పరిస్థితిలో ఒకరికి రక్తదానం చేసిన దుర్గారావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రక్తదానం చేయడం వలన ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చు, ప్రతి రక్తపు బొట్టు విలువైనది ఏదైనా పునరుత్పత్తి చేసుకోవచ్చు గానీ రక్తాన్ని మాత్రం ఎవరో ఒకరు దానం చేయడం వల్లే పొందవచ్చు అని తెలియచేశారు.నువ్విచ్చే రక్తం వేరొకరికి జీవితం లిఒకరి దానం మరొకరి ప్రాణం రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి మీ రక్తంతో ఒక్కరినైనా కాపాడవచ్చు కులం, మతం లేనిది ఒకే రంగులో ఉండి మనుషులంతా ఒక్కటేనని చెబుతుంది, నువ్వు ఇచ్చే రక్తం వేరొకరికి పునర్జన్మణిస్తుంది, నువ్విచ్చే ఒక్కో రక్తపుబొట్టు ఇంకో ప్రాణం నిలబడుటకు ఆయువుపట్టు అని అన్నారు.

# కొరటపల్లిలో మహిళా వారోత్సవాలు

**రామడుగు, మే29 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండలం కొరటపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రానికి హాజరై ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కొరటపల్లి అంగన్వాడి కేంద్రం ఆదర్శవంతంగా ఉండేందుకు తాను అన్ని విధాల సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు పెంపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. కేంద్రంలో తల్లులు, పిల్లలకు అవసరమైన కనీస వసతులు లేకపోయినా తమ వంతు సహాయం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం సీడీపీఓ నర్సింగరాణి మహిళల ఆరోగ్య జాగ్రత్తలు, ఐసీడీఎస్ సేవలు, పోషకాహారం ప్రాముఖ్యత, బాల్య వివాహాల నివారణ, తొలి వెయ్యి రోజుల సంరక్షణ, సఖి, ఐసీపీఎస్ సేవలు, 181 మరియు 1098 టోల్ ఫ్రీ నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. 3 నుంచి 6 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మహేశ్వరి, సీడీపీఓ నర్సింగరాణి, సూపర్వైజర్ రేణుక, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు, అంగన్వాడి టీచర్ అమృత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.





## మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

- ధర్మపురి సిఐ ఎ.రాం నర్సింహారెడ్డి
- వెల్గటూర్ మండల కేంద్రంలో దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) మే 29:**

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని ధర్మపురి సిఐ ఎ.రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా ఆంటీ డ్రగ్ మరియు నారకోటిక్ టీం ఆధ్వర్యంలో ట్రెయిన్డ్ డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి మండలంలోని ప్రధాన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించబడుతున్నాయన్నారు.ఈ నేపథ్యంలో జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్, వెల్గటూర్ పోలీస్ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి మండల కేంద్రంలోని పలు దుకాణాలు మరియు ప్రజా రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. అంబేద్కర్ చౌరస్తా పరిసర ప్రాంతాల్లోని కిరాణా షాపులు, టీ స్టాళ్లు, పాన్ దుకాణాలు, బస్టాండ్ పరిసరాలు మరియు అనుమానాస్పద ప్రదేశాలలో గంజాయి మరియు ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల కోసం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో గంజాయి, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని, ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ మరియు సామాజిక జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎవరైనా గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలని సీఐ రాం నర్సింహారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్, వెల్గటూర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ గ్రామాన టీఆర్ఎస్ జెండా

- సిద్దిపేటలో జెండా పండుగకు కల్వకుంట్ల కవిత
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుల వెల్లడి

**సిద్దిపేట, మే 29 (ప్రజా తీర్పు ప్రతినిధి.):**

రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ వాదాన్ని వదిలి ఫక్తు రాజకీయపార్టీగా మారడం వల్లే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆవిర్భవించిందని టీఆర్ఎస్ రాష్ట్ర పరిశీలకులు లోక రవిచంద్ర అన్నారు. తన పార్టీ పేరులోని "తెలంగాణ" పదాన్ని తొలగించడం వల్ల తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడేందుకే కల్వకుంట్ల కవిత ఇంటిపార్టీని ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. పార్టీ జెండా పండుగ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ కొట్టాల యాదగిరి, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జీలు మల్లారెడ్డి, గ్యాదరి గిరి, నియోజకవర్గ పరిశీలకులు కంచర్ల శివారెడ్డితో కలిసి సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కొత్త రాజకీయ ఒరవడి తీసుకురావాలనే లక్ష్యంతో కవిత ఈ పార్టీని స్థాపించారని రవిచంద్ర పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావానికి వేల మంది ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు. మే 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జెండా పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జూన్ మొదటి వారంలో సిద్దిపేటలో భారీ స్థాయిలో టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కూడా సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వలసవాదుల ప్రయోజనాల కోసం పాలన సాగిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులందరినీ ఏకం చేసే దిశగా టీఆర్ఎస్ పార్టీ పనిచేస్తోందని పేర్కొన్నారు. జూన్ మొదటి వారంలో జరిగే జండా పండుగ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గ సమీక్ష

తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ నిర్వహణపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గంలో జూన్ 20 లోగా గ్రామగ్రామాన టీఆర్ఎస్ జెండాలు ఎగరేయడానికి తీసుకోవలసిన చర్యలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జూన్ మొదటి వారంలో సిద్దిపేట పట్టణంలో పార్టీ జెండా ఆవిష్కరణకు అధినేత్రి హాజరయ్యే కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు గౌస్ మోయినొద్దిన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి రేవంత్ సర్కారే

- సంక్షేమ పథకాలతో ప్రజల మనసు గెలిచాం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తత అవసరం
- మాజీ ఎమ్మెల్యే,పార్లమెంటు సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 29**



సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన విడివిడిగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్ కార్పొరేషన్ ముఖ్య నేతలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాలకు మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంటు పిసిసి సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ పై అవగాహన, బిఎల్ఏ -2 ల నియామకం, సంఘటన్ సృజన్ అభియాన్ కమిటీల పనితీరు, బూత్ స్థాయి బలోపేతంపై మండల, పట్టణ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులకు అనుబంధ సంఘాల అధ్యక్షులకు నాయకులకు నేతలు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరోసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమాన్ని పరిశీలించడానికి పిసిసి సమన్వయకర్తగా విచ్చేసిన కూన శ్రీశైలం గౌడ్ గతంలో శాసన సభ్యులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేసినారు, భారత ఎన్నికల సంఘం ఈ సమగ్ర ఓటర్ సవరణ పేరుతో కొత్తగా ఓటర్లుగా చేర్చడం అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఏదైనా కారణం తోటి ఓటర్ జాబితా నుంచి తొలగించే కార్యక్రమాన్ని మన ఎన్నికల సంఘం చేపట్టింది చొప్పదండి నియోజకవర్గం పూర్తిగా గ్రామీణ ప్రాంతం, ఈ గ్రామంలో గాని ఏ బూతులు కానీ ఓటర్ ను తొలగించే కార్యక్రమం చాలా అరుదుగా జరుగుతుందని అన్నారు. కరీంనగర్ లాంటి నగర ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది అలాగే బిజెపి వాళ్లు కొన్ని వర్గాల వారిని టార్గెట్ చేసుకొని వారిని తొలగించే కార్యక్రమం ముఖ్యంగా కరీంనగర్ హైదరాబాద్ లాంటి నగరాల్లో ఎక్కువ జరుగుతదని అన్నారు. సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఓట్లు ఉన్నాయా లేదా గ్రామంలో అందరి ఓట్లు లేకపోతే కొత్తగా చేర్పించడం లాంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు.వెస్ట్ బెంగాల్ లాంటి కొన్ని సరిహద్దు రాష్ట్రాల్లో ఓటర్ సవరణ కార్యక్రమం చేపట్టడం ద్వారా బిజెపి అక్కడ విజయం సాధించారు, అట్లాంటి ప్రమాదం మన రాష్ట్రంలో మన నియోజకవర్గంలో చాలా తక్కువగా ఉంటుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ 9 సంవత్సరాలు ఈ రాష్ట్రంలో ఏ ఒక్క పేదోడికి న్యాయం చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. దాదాపు ఆరు ఏడు లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్ర మొత్తం ఆర్థికంగా దివాళా తీసినటువంటి పరిస్థితి నెలకొందని,అయినా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా రైతాంగం సంక్షేమం కోసం రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న 90శాతం రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. ఈ దేశంలో ఏ రాష్ట్రం ఏ పార్టీ చేయని గొప్ప పని మన తెలంగాణ ప్రభుత్వం చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జిపిఎస్ విధానంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పది రోజులు ఆలస్యం జరిగింది, మూడు సంవత్సరాల పంటలను ఎఫ్సిఐ ధాన్యం గోదాముల నుండి తీసుకోకపోవడం వల్ల ధాన్యం సేకరించే విషయంలో ఆలస్యం జరిగిందని అన్నారు. ఈ విధమైన కారణాలు తప్ప ఎక్కడా రైతులను మోసం చేసే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం, గడిచిన రెండు సంవత్సరాలలో 1,60 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగానికి ఖర్చు పెట్టి ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిందన అన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు ఇవ్వగా దాదాపు 80 శాతం ఇల్లు పూర్తి అవుతున్న దశలో ఉన్నాయి, కొన్ని ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మనసుకు చాలా ఆనందంగా ఉంటుంది, ప్రతి ఇంటికి అర్హులైన ప్రజలకు తెల్ల రేషన్ కార్డు అందించాము 20 యూనిట్లలో ఉచిత విద్యుత్ అందించడం ద్వారా దాదాపు ప్రత్యక్షంగా పరోక్షంగా 1500 రూపాయలు ఆర్థిక లాభం అందజేస్తున్నాము, మహిళా ఆడపడుచులకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించాము, రెండున్నర సంవత్సరాలలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాము ఈ విధంగా అభివృద్ధి సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రజలందరూ విశ్వసిస్తున్నారు అని అన్నారు.మరోసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది మండలనియోజకవర్గ స్థాయిలో జిల్లా స్థాయిలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుంది ఆ బాధ్యత మేము తీసుకుంటాము అన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ తక్కువైంది కాంగ్రెస్ పార్టీ వారు కాంగ్రెస్ పార్టీ వారి పైనే విమర్శలు చేసుకుంటున్నారు, మనమంతా ఒక కుటుంబం చిన్న చిన్న భేదాలు ఉంటే సరిదిద్దుకోవాలి. మన పోరాటం మన యుద్ధం మన ప్రతిపక్షాలైన బిజెపి బిఆర్ఎస్ పార్టీలపై చేయాలి. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే లక్ష్యంతో ప్రతి నాయకుడు కార్యకర్త పనిచేయాలి, ఎందుకంటే దేశంలో దౌర్భాగ్యమైన పరిస్థితులు ఉన్నాయి పెట్రోల్ డీజిల్ రేట్లు నిరుద్యోగ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి.

### ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఏ ఒక్క ఓటరును కూడా తొలగించకుండా

18 సంవత్సరాలు నిండిన యువకులను కొత్త ఓటర్లుగా చేర్పించే ప్రక్రియలో భాగస్వాములు కావాలని అన్నారు. కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే సోనియాగాంధీ రాహుల్ గాంధీ ఎస్ఐఆర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర ఎన్నికల కమిషన్ ను ముందు పెట్టి కాంగ్రెస్ పార్టీ అనుకూల ఓటర్లను తొలగించే ప్రక్రియ చేపడుతుందని దానిపై ప్రతి పౌరునికి అవగాహన అవసరమని అన్నారు. కేవలం బిఎల్ఎ 2 లపై బాధ్యతను పెట్టకుండా ప్రతి బూతు నుండి కనీసం ఐదుగురు పార్టీ సభ్యులు బాధ్యత తీసుకొని కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ పార్టీ ఓటర్లను కాపాడుకునే విధంగా ఓటర్ మ్యాపింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో బిఎల్ ఏ 2 ల నియామకం పూర్తయిందని త్వరలోనే వారికి శిక్షణ తరగతులు నిర్వహించే విషయం లోపల ఇప్పటికే అవగాహన కల్పించామని, ఏఐసీసీ పీసీసీ ఆదేశాల మేరకు నగరంలో ఎన్నికల అధికారులు చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్టు వైద్యుల అంజన్ కుమార్ పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశాలలో నాయకులు పిసిసి ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్ పులి ఆంజనేయులు గౌడ్ కర్ర సత్య ప్రసన్న రెడ్డి బానోతు శ్రవణ్ నాయక్ కొరివి అరుణ్ కుమార్ పురం రాజేశం వెన్నం రజిత రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి జవ్వాజి హరీష్ సువిన్ యాదవ్ మహేందర్ మంత్రి నాయకులు అబ్దుల్ రెహమాన్ కోల రమేష్ పురుమల్ల మనోహర్ ముద్దం తిరుపతి గౌడ్ సిరిపురం లావణ్య నాగప్రసాద్ గంట శ్రీనివాస్ పర్వతం మల్లేశం గుమ్మడి రాజకుమార్ ఫహద్ మూల కృష్ణారెడ్డి కపిల్ మాధవ్ ముస్తాక్ నూనె గోపాల్ రెడ్డి పెంట శేఖర్ మరియు కార్పొరేటర్లు మార్కెట్ కమిటీ చైర్మన్లు సర్పంచులు కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

రైస్ మిల్లుల్లో ధాన్యంపై కట్టింగ్‌లు వద్దన్న కలెక్టర్

**గోదావరిఖని, మే 29,( ప్రజా తీర్పు):**



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, శారదనగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గౌతమినగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, సమయం ముగిసిందని రోగులను వెనక్కి పంపకుండా శాంపిల్స్ సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని సూచించారు. గైనిక్ ఓపీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శారదనగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్ ఇంటర్మీడియట్ ఫలితాలు, స్టడీ రూమ్ సౌకర్యం, అడ్మిషన్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని అధికారులకు సూచించారు. తదుపరి గౌతమినగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన కలెక్టర్ రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్‌లు విధించవద్దని మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలని, రైతులు ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో వైద్యులు అరుణ, కృపాభాయి, రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ కార్మికులకు చల్లని ఉపశమనం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**జ్యోతినగర్, మే 29 (ప్రజా తీర్పు)**

ఎండల తీవ్రతతో అలసిపోతున్న కాంట్రాక్ట్ కార్మికులకు చల్లని ఉపశమనం కలిగించేలా లయన్స్ క్లబ్ ఆఫ్ ఎన్టిపిసి జ్యోతినగర్ ప్రగతి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్టిపిసి లేబర్ గేట్--2 ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది కార్మికులకు మజ్జిగ అందజేశారు. కొమురవెల్లి సుధాకర్ నిర్వహణలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బుర్ర శంకర్ గౌడ్ పాల్గొని కార్మికులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు మిట్టపల్లి అనిల్ రావు, గుండేటి కిషోర్, బుర్ర దేవేందర్ గౌడ్ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ వాసవి చీఫ్ ఆర్గనైజర్ కొమరవెల్లి రాహుల్, లక్ష్మణమూర్తి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేసవి వేడిలో కార్మికులకు చల్లని మజ్జిగ అందిస్తూ "మనిషికి సేవే మహోన్నత ధర్మం" అనే సందేశాన్ని క్లబ్ సభ్యులు చాటిచెప్పారని పలువురు అభినందించారు.



# జూన్ 2 నాటికి ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే-29**

జూన్ 2 నాటికి ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి జిల్లా స్థాయి భవనం పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మహిళా సంఘాలకు సొంతంగా భవనం ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లా స్థాయి ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మిస్తోందని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భవనంలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, సమావేశాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి పనిని పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. భవన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధికి ఉపయోగపడేలా జిల్లా స్థాయి ఇందిరా మహిళా శక్తి భవనంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి జూన్ 2న ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారుఈ పర్యటనలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 29:**

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శులకు బాల్య వివాహాల నిరోధక చట్టంపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ జెడ్పీ సీఈఓ సంజీవరావు, సూపరింటెండెంట్ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి పి. వేణుగోపాల్ రావు, సీడీపీఓ కవిత, డీసీపీఓ జితేందర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ, కనకరాజు, సతీష్, సమత, స్వర్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.



# అమెరికాకు ఎగుమతుల కోసం రైతులను బలి చేస్తున్నారా?

మోదీ ప్రభుత్వంపై మల్లన్న ఆగ్రహం

**గోదావరిఖని, మే 29, (ప్రజా తీర్పు) :**

దేశ ప్రజలకు సరిపడా ఆహారం లేకుండానే చిరుధాన్యాలను అమెరికాకు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోవడం దారుణమని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న విమర్శించారు. శుక్రవారం గోదావరిఖనిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల శ్రమను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం, అమెరికాతో చిరుధాన్యాల ఎగుమతులపై ఒప్పందాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. "మన ప్రజలకు సరిపడా ధాన్యం లేకుంటే విదేశాలకు ఎందుకు ఎగుమతి చేస్తున్నారు?" అంటూ ప్రశ్నించారు. విత్తనాలు, ఎరువులు, డీజిల్ ధరలను పెంచి సాగు ఖర్చులను అధికం చేశారని, రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని పేర్కొన్నారు. దేశీయంగా పండించిన ప్రతి గింజకు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతాంగంతో కలిసి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని మల్లన్న హెచ్చరించారు.

# కోప్టా చట్టం అమలును కట్టుదిట్టం చేయాలి

- విద్యాసంస్థల సమీపంలో పొగాకు విక్రయాలపై ప్రత్యేక నిఘా
- పబ్లిక్ ప్లేస్‌లో ధూమపానం చేస్తే జరిమానాలు తప్పవు : కలెక్టర్ కోయ శ్రీహర్ష

**(దుర్గం నగేష్ ప్రజాతీర్పు, పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, మే 29 :**



జిల్లాలో కోప్టా చట్టం-2003 అమలును మరింత పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, గురుకులాల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ఎన్‌టీసీపీ మరియు కోప్టా చట్టం అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను పొగాకు రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ సహకారంతో జూనియర్ కళాశాలలు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు వంటి ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై వెంటనే జరిమానాలు విధించాలని సూచించారు. ఒకే తప్పును మళ్లీ చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి నెలా గ్రౌండ్ లెవల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్ట అమలును సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలని, కోప్టా చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మహేశ్వరం మండలానికి ఉచిత పాఠ్యపుస్తకాలు చేరిక

జూన్ 1 నుండి పాఠశాలలకు పంపిణీ

డాక్టర్ వి.కస్నా నాయక్ ఎంఈఓ .మహేశ్వరం

**(వైయాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే. 29**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలంలోని విద్యార్థులకు 2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఉచిత పాఠ్యపుస్తకాలు రామంతాపూర్ బుక్ డిపో నుండి మండలానికి చేరినట్లు మండల విద్యాధికారి వి. కాస్నా నాయక్ తెలిపారు. మొదటి, రెండో, మూడో, ఆరో మరియు పదో తరగతుల పాఠ్యపుస్తకాలు పూర్తిగా అందినట్లు తెలిపారు. మిగిలిన తరగతులలో నాలుగో తరగతి తెలుగు, ఐదో తరగతి తెలుగు, ఏడో తరగతి ఇంగ్లీష్, ఎనిమిదో తరగతి తెలుగు, గణితం, జీవశాస్త్రం, అలాగే తొమ్మిదో తరగతి ఇంగ్లీష్, హిందీ పాఠ్యపుస్తకాలు తప్ప మిగతా అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ పాఠ్యపుస్తకాలను జూన్ 1, 2026 (సోమవారం) నుండి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇక నోటు పుస్తకాలు ఇప్పటికే పంపిణీ చేసినట్లు, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఫ్రీ ప్రైమరీ స్కూల్ కింద... రావిరాల గ్రామంలో.. మరియు తుక్కుగూడ గ్రామంలో.. నర్సరీ ఎల్కేజీ యూకేజీ క్లాసులో చెప్పబడును అని తెలిపారు.. డిఆర్ వి . కస్నా నాయక్ ఎంఈఓ .మహేశ్వరం మండల విద్యాధికారి, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా.



# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌ని కలిసిన స్వామి వివేక్ పటేల్

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 29:**

పెద్దపల్లి నియోజకవర్గానికి భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా నూతనంగా నియామకం పొందిన ఎమ్మెల్సీ పరిపాటి వెంకటరామిరెడ్డి (ఐఏఎస్ రిటైర్డ్)ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకర్తలను మరింత చైతన్యపరిచే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దిశనిర్దేశం చేసినట్లు ఓ పత్రిక ప్రకటనలో ఆకుల స్వామి వివేక్ పటేల్ తెలిపారు.




# మా భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపివేయండి

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 29:**

ప్రభుత్వం మాకు కేటాయించిన స్థలంలో, అక్రమంగా నిర్మిస్తున్నా కట్టడాలను ఆపివేయాలంటూ భాదితులు మీడియాతో వాపోయారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రామంచ అనసూర్య పురుషోత్తం దంపతులు మాట్లాడుతూ.. మాకు 1986లో కూనారాం రోడ్ (బీఎన్‌కాలనీ)లో ప్రభుత్వం ప్లాట్ కేటాయించింది. అందులో 65 మంది నిర్మాణాలు చేసుకున్నారు. నాకు కేటాయించిన స్థలంలో నేను సైతం పిల్లర్స్ వరకు నిర్మాణం చేసిన, ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే నిర్మాణ పనులు నిలిపివేశాను. మా పిల్లల పెళ్లి కోసం ఆ స్థలం అమ్మేందుకు ఓదెలు అనే వ్యక్తికి విక్రయించాలని కాగితం రాసుకున్నాం. దానికిగాను బయ్యానగా రూ. 2లక్షలు నాకు ఇచ్చారు. ఐతే అతడు ప్లాట్ కొనేందుకు ఆసక్తి చూపకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న కొనం సదానందం ఆ ప్లాట్ కొనుగోలు చేస్తా అని చెప్పాడు. కానీ మాకు పైసలు ఇవ్వకుండానే నా ప్లాట్‌లో ముగ్గుపోసి, జేసీబీ సహాయంతో నిర్మాణా పనులు చేస్తున్నాడు. విషయం తెలిసి పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశా. మున్సిపాలిటీ అధికారులు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయద్దు అని చెప్పిన, రాత్రి వేళల్లో పనులు అలాగే కొనసాగిస్తున్నారు. నాకు బయ్యానగా ఇచ్చిన రూ. 2లక్షలు వాపస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా లేదా మిగిలిన పైసలు ఇచ్చిన ప్లాట్‌ను అప్పగిస్తాం. అలాకాకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నా కొనం సదానందం పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ నిర్మాణాలకు ఇంటి నెంబర్, ఇంటి పర్మిషన్ ఇవ్వకుండా నిలిపివేసి నాకు న్యాయం చేయాలని కోరారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020